



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల ఇక్కట్లు

తిరుగు పయనం




బైక్ మీద వెళ్తూ..

విజయనగరం జనవరి 16(ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి పండుగ కోసం సొంతూరికి వచ్చినవారు తిరుగు పయనమయ్యారు. దీంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిసి పోయాయి. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు భోగికి ఒక రోజు ముందే ఊరికి వచ్చారు. నాలుగు రోజుల పాటు మిత్రులు, బంధువులతో సంతోషంగా గడిపారు. కుటుంబంతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. బంధువులకు వీడ్కోలు పలుకుతూ గురువారం బయలుదేరారు. దీంతో జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు రద్దీగా కనిపించాయి. ముఖ్యంగా విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి తదితర ప్రాంతాల వారికి బస్సులు, రైళ్లు అందు బాటులో ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లేవారికి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో వందలాది కిలోమీటర్ల నుంచి వచ్చిన కొందరు ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. ప్రమాదమని తెలిసినా.. తప్ప డం లేదు. ఆర్టీసీ బస్‌స్టేషన్లలో బస్సులు సమయానికి రాక, సీట్లు లేక చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో కొందరు ప్రైవేట్ ట్రావెల్స్ రెట్టింపు ధరలు వసూలు చేశారు.

ఒక్క ఇటుక పడితే ఒట్టు

- రెండుసార్లు స్థల సేకరణ, శంకుస్థాపన
- పనులు మాత్రం అస్సలు జరగలే
- గిరిజన వర్సిటీకి సమకూరని భవనాలు
- పరాయి పంచలో విద్యార్థుల చదువులు
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం వల్లే..
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయానికి మెంటాడ వద్ద సేకరించిన భూములు

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణానికి ఇప్పటికీ పునాది రాయి కూడా పడలేదు. పైగా కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. తరచూ కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీకి ముందు టీడీపీ ప్రభుత్వం సేకరించిన స్థలంలో గిరిజన విశ్వ విద్యాలయానికి పూనుకుని ఉంటే ఈ పాటికే విద్యార్థులకు సొంతగూడు దొరికేది. పరాయి పంచన చదుకోవాల్సిన దుస్థితి తప్పేది. కానీ జగన్ సర్కారు తీసుకున్న తప్పుడు నిర్ణయంతో గిరిజన విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగింది. ఇప్పుడు భవన నిర్మాణాల అంచనా వ్యయం విపరీతంగా పెరిగి కూటమి ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారింది.



శృంగవరపుకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి)

● గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ నిర్మాణం కోసం కొత్తవలస మండలం రెల్లి గ్రామ పరిధిలో 526.91 ఎకరాలను సేకరించారు. గిరిజనుల ఆక్రమణలో ఉన్న ఈ భూములను సేకరించేందుకు అప్పటి పాలకులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గిరిజనులను ఒప్పించేందుకు అప్పటి, ఇప్పటి శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి తీవ్రంగా శ్రమించారు. సేకరించిన భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి 2019లో పనులకు శంకుస్థాపన చేశారు.

● వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ విశ్వవిద్యాలయం నిర్మాణానికి మళ్లీ భూ సేకరణ చేపట్టింది. మెంటాడ, దత్తిరాజేరు మండలాల మధ్య 561.91 ఎకరాల సేకరణకు పూనుకుంది. అనేక వివాదాలు చుట్టుముట్టడంతో పూర్తి స్థాయిలో స్థల సేకరణ చేయకుండానే 2023 ఆగస్టు 25న అప్పటి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పనులకు శంకుస్థాపన చేయించారు. అంతే ఆ తరువాత దాని ఊసే మరిచారు.

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా పదేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి గిరిజన విశ్వ విద్యాలయాన్ని కేటాయించింది. ఈ విశ్వవిద్యాలయాన్ని విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారు. దీని కోసం కొత్తవలస మండలం రెల్లిలో 526.91 ఎకరాలను సేకరించారు. దీనికి కేంద్ర కమిటీ ఆమోద ముద్ర వేసింది. 2019లో పనులకు శంకుస్థాపన చేశారు. ఇంతలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చింది. అంతే, టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెనక్కినెట్టారు. ఇందులో భాగంగా రెల్లిలో గిరిజన యూనివర్సిటీ కోసం కేటాయించిన భూములను పక్కన పెట్టేశారు. మెంటాడ, దత్తిరాజేరు మండలాల మధ్యలో మళ్లీ భూసేకరణ చేపట్టారు. ఈ రెండు మండలాల పరిధిలోని చినమేడపల్లి, మర్రివలస గ్రామాల వద్ద 561.91 ఎకరాలు కేటాయించారు. 2023 ఆగస్టు 25న అప్పటి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పనులకు శంకుస్థాపన చేయించారు. ఇదిగో కట్టేస్తున్నాం.. అదిగో నిర్మించేస్తున్నాం అంటూ ప్రకటనలతో కాలయాపన చేసేశారు. అందుబాటులో ఉన్న భూమిని వదిలేసి కొత్తగా భూసేకరణకు దిగడంతో ఐదేళ్ల కాలం కరిగిపోయింది. అయినా సేకరించిన భూముల్లో ఒక్క ఇటుక కూడా వేయలేదు. సొంత భవనం లేకపోవడంతో కొండకరకాం వద్ద ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయ పీజీ సెంటర్‌లో గిరిజన యూనివర్సిటీ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న అంచనా వ్యయం..

గిరిజన యూనివర్సిటీ నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో ఏడాదికేడాదీ

(మిగతా 8వ పేజీలో...)



తీర్థంలో పాల్గొన్న భక్త జనం

కన్నుల పండువగా కనకదుర్గమ్మ తీర్థం

గంట్యాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొటారుబిల్లి కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవాన్ని గురువారం సాయంత్రం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 వరకూ తీర్థ మహోత్సవం సాగింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎస్ఐ సాయి కృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరాలపై పోలీసుల దాడి

చీపురుపల్లి/నెల్లిమర్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండుచోట్ల నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై పోలీసులు గురువారం దాడి చేశారు. కోడిపుంజులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ ఎల్.దామోదరావు తన సిబ్బందితో వెళ్లి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 6 కోడి పుంజులు, రూ.15280 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ● నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లిలోని చెరువు పక్కన కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ అరెస్టు చేశారు. వారి నుంచి 3 కోడి పుంజులు, రూ.1510 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



చీపురుపల్లి పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

పండగకు వచ్చి.. తిరిగి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు దుర్మరణం
- భార్య, చిన్నకుమారుడికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలం

రాంబాబు (ఫైల్)



మోక్షశ్రీహాన్ మృతదేహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉమ

సంక్రాంతి కోసం ఆయన తన భార్యాపిల్లలతో కలిసి స్వగ్రామం వెళ్లాడు. అక్కడ కుటుంబసభ్యులంతా ఆనందం పండుగ జరుపుకొన్నారు. తిరిగి ద్విచక్ర వాహనంపై తన భార్యాపిల్లలను ఎక్కించుకుని నివాస ప్రాంతానికి బయలు దేరాడు. మరో ముప్పావు గంటలో ఇంటికి చేరుకుంటారనే లోగా లారీ రూపంలో మృత్యువు కబళించింది. బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో తండ్రీకుమారుడు దుర్మరణం చెందాడు. భార్య, చిన్న కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం స్వగ్రామంలో తెలియడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.


పార్వతీపురం రూరల్/ జియ్యమ్మవలస/ రామభద్రపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం నర్సిపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జియ్యమ్మవలస మండలం అల్లువాడకు చెందిన లోలుగు రాంబాబు (45), అతని పెద్ద కుమారుడు మోక్షశ్రీహాన్ (5) దుర్మరణం చెందారు. ఈ ఘటనలో రాంబాబు భార్య ఉమామహేశ్వరి, చిన్న కుమారుడు సూర్యశ్రీహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. రాంబాబు బాడంగి మండలంలోని 108 వాహనంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ)గా గత పదేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. భార్య ఉమ పాచిపెంట మండలంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వీరు తమ ఇద్దరు కుమారులతో కలిసి విజయనగరం జిల్లా రామభద్రపురంలో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగ కోసం ఈ నెల 13న భోగి నాడు రాంబాబు తన భార్యా పిల్లలతో కలిసి స్వగ్రామం అల్లువాడ వచ్చా డు. అక్కడ తన తల్లిదండ్రులు లోలుగు అప్పలనాయుడు, అప్పమ్మ, తమ్ముడు మన్మథరావుతో కలిసి సంక్రాంతి జరుపుకున్నాడు. గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై తన భార్యా పిల్లలతో కలిసి రామభద్రపురానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మరో ముప్పావు గంటలో ఇంటికి చేరుతారు అనుకునేలాలోగా పార్వతీపురం మండలం నర్సిపురం వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో రాంబాబు, అతని పెద్ద కుమారుడు మోక్షశ్రీహాన్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన భార్య ఉమ, చిన్న కుమారుడు సూర్యశ్రీహాన్‌ను అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఉమ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గోవిందరావు తెలిపారు.

రెండుచోట్ల విషాదం..

రాంబాబు, ఆయన కుమారుడు మోక్షశ్రీహాన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి స్వగ్రామం అల్లువాడతో పాటు వారు నివాసం ఉంటున్న రామభద్రపురంలో విషాదచాయలు అలుముకున్నాయి. 'మా ఆశలు ఆవిరైపోయాయి. మా చివరి కాలంలో మాకు తోడుగా ఉంటాడనుకున్న మా పెద్ద కొడుకు మాకు దూరమైపోయాడు. మాకు దిక్కెవరు.. దేవుడా ఇది నీకు న్యాయమా?' అంటూ రాంబాబు తల్లిదండ్రులు రోదిస్తున్నారు. వారు ఏడుస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ఆయువు పోద్దాం

- అవయవదానంపై పెరుగుతున్న చైతన్యం
- ఆరు నెలల్లో 88 మంది నేత్రదానం
- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న ప్రజలు



● గత ఏడాది నవంబరు 13న పాచిపెంట మండలం కొత్తవలసకు చెందిన ఎల్.సాయికుమార్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మక్కువ మండలం సరాయివలస వద్ద బైక్ ప్రమాదంలో ఆయన బ్రెయిన్ డెడ్ అయింది. ఒక్కగానొక్క కుమారుడు మృతితో తల్లిదండ్రులు లక్ష్మణ్, శ్రీదేవి గుండెలవిసేలా రోదించారు. కుమారుడి అవయవదానానికి ముందుకొచ్చారు. జీవన్‌దాన్ ట్రస్ట్ సమక్షంలో గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు దానం చేశారు. గుండెను విశాఖ విమానాశ్రయం నుంచి చెన్నైకు తరలించారు.

● నవంబరు 22న గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన గొర్లె వెంకటరమణ, దేవి దంపతుల ఒక్కగానొక్క కుమార్తె పల్లవిని తీసుకుని వీకేపర్తి వైకుంఠగిరిలో దైవదర్శనానికి తీసుకెళ్తుండగా వీరి బైక్ అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో పల్లవి బ్రెయన్ డెడ్ అయ్యింది. దీంతో కుటుంబసభ్యులు అవయవదానానికి ముందుకు రావడంతో వెంటనే జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా అవయవాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు.

- ఈ రెండు ఘటనలతో స్ఫూర్తి పొందిన చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామస్థులు 50 మంది అవయవదానానికి ముందుకొచ్చారు. మరణానంతరం అవయవదానం చేస్తామంటూ నవంబరు 24న అంగీకారపత్రాలు అందించారు. చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ అవయవదానంపై అవగాహన కల్పించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రాజాం, జనవరి 16: అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 88 మంది తమ కళ్లను దానం చేశారు. 2014-2019 మధ్య 884 కార్నియాల సేకరణ జరగగా.. 2019-24 మధ్య మాత్రం 380 కార్నియాలు మాత్రమే జరిగాయి. జిల్లాలో అవయవాలు అవసరమైన వారు వేలల్లో ఉన్నారు. కానీ పదుల సంఖ్యలో కూడా సేకరణ ఉండడం లేదు. సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు బ్రెయిన్ డెడ్‌కు గురవుతారు. అలాంటివారు స్పృహలోకి రావడం దాదాపు అసాధ్యం. అందుకే అలాంటివారి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసేలా అధికారులు అవ గాహన కల్పిస్తున్నారు. జీవన్‌దాన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రభు త్వమే గ్రీన్ చానల్ ద్వారా వాటిని తరలించే ఏర్పాటు చేస్తుంది. అందుకు అయ్యే ఖర్చును ప్రభు త్వమే భరిస్తుంది. ప్రజలు వెబ్‌సైట్ ద్వారా అవయవదానానికి ప్రతిజ్ఞ పూనేలా 'ఎన్‌హెచ్‌టీ టీవో'ను ప్రభుత్వం తీసుకొచ్చింది. దాత నుంచి సేకరించిన అవయవాన్ని గ్రహీత ఉంటే.. గ్రీన్‌కారిడార్ పేరిట తరలిస్తారు. ఒక వ్యక్తి అయవదానం చేస్తే ఎనిమిది మందికి వాటిని అమర్చవచ్చు. అయితే అవయవా లన్నీ సరిగ్గా ఉంటేనే అది సాధ్యపడుతుంది. బ్రెయన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి కాలేయం, ఊపిరితిత్తుల, మూత్రపిండాలు, గుండె, గుండె కవటాలు, పేగులు, క్లోమం, కార్నియా వంటివి సేకరించి మరొకరికి అమర్చవ చ్చు. జీవించి ఉన్న వ్యక్తుల నుంచి మూ త్రపిండాలు, ఎముకలోని మూలుగు, కాలేయంలోని కొంత భాగం దానం చేయవచ్చు. అయితే ఆస్పత్రుల్లో (మిగతా 8వ పేజీలో..)

గుహలింగేశ్వర స్వామి తీర్థ మహోత్సవం 7

రహదారి నిబంధనలు పాటించాలి: కలెక్టర్ 7

జీఎంఆర్‌తో ఎమ్మెల్యే కోండ్రు భేటీ 7

అడుగుకో గొయ్యి.. ఆదమరిస్తే అంతేనోయి!

● అధ్వానంగా రాజాం-బొద్దాం రహదారి ● పట్టించుకోని అధికారులు



పెనుబాక సమీపంలో రహదారి దుస్థితి

రాజాం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతి పండుగకు వచ్చేవారు రహదారుల్లోని గుంతల ఫొటోలు పెడితే కఠిన చర్యలు తప్పవు.. పండుగ లోగా రహదారులపై గుంతలు ఉండకూడదు..' ఇదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతేడాది డిసెంబరులో చేసిన ప్రకటన. ఈ ప్రకటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా అధికారుల్లో ఆలోచన రేకెత్తించింది. అవకాశం ఉన్నమేర రహదారులపై గుంతలు పూడ్చేందుకు రహదారులు, భవనాల శాఖ సిద్ధమైంది. రాజాం నియోజకవర్గంలో ఇలాంటి మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. పట్టణంతో పాటు నియోజకవర్గంలో వివిధ రహదారుల మరమ్మతుల కోసం ఈ నిధులను వినియోగించారు. అయితే రాజాం -చీపురుపల్లి రోడ్డు వైపు మాత్రం అధికారులు కన్నెత్తి చూడలేదు. ప్రధానంగా పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని గార్రాజు చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని ఇప్పిలిపేట వరకూ అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. ఫలితంగా ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వందలాది మంది వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ప్రమాదాల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. రాజాం పట్టణంలో రెండో విడత విస్తరణలో భాగంగా బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రి కాలనీ వరకూ రహదారిని విస్తరించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం దీనిని గాలికి వదిలేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.13 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తంలో గత ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్‌కు రూ.6 కోట్లు చెల్లించి... మిగిలిన రూ.9 కోట్లతో ప్రస్తుతం రాజాం - డోలపేట మధ్య విస్తరణ పనులు చేపడుతున్నారు. కానీ.. గాయత్రి కాలనీ నుంచి ఇప్పిలిపేట వరకూ రహదారి అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి... గోతులను పూడ్పించాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

జీఎంఆర్‌తో ఎమ్మెల్యే భేటీ

రాజాం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఎంఆర్ సంస్థల చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనతో నియోజకవర్గానికి సంబంధించిన వివిధ విషయాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. అనంతరం జీఎంఆర్‌ను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గురవాన నారాయణరావు, మద్దు హరి, పొన్నాడ పురుషోత్తమరావు, టంకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆదిభట్ల సంస్మరణోత్సవం

విజయనగరం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఈ నెల 18న త్యాగరాజస్వామి ఆరాధన, ఆదిభట్ల నారాయణదాసు సంస్మరణోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి మండపాక రవి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కలెక్టర్ సందర్శన

లక్కవరపుకోట/వేపాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మారిక, రేగ, పుణ్యగిరి ప్రాంతాలను కలెక్టర్ అంబేద్కర్ శుక్రవారం సందర్శించనున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. గిరిజనుల కష్టాలపై ఇటీవల ఎమ్మెల్యే ప్రస్తావించారు. నాలుగు రోజుల క్రితం దీనిపై కలెక్టర్‌తో ఆమె వ్యక్తిగతంగా చర్చించారు. ఈమేరకు స్పందించిన కలెక్టర్ మారిక, రేగ, పుణ్యగిరి గ్రామాలను సందర్శించనున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వంగర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతమరువాడ, కొత్తమరువాడ, సీతాదేవిపురం గ్రామాలకు సరఫరా ఉండదని వెల్లడించారు.

నేటి నుంచి జాతర

సంతకవిటి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోర్కెలు తీర్చే కల్పవల్లి బాల అన్నమ్మ తల్లి 46వ జాతర మహోత్సవాలు సురవరం గ్రామంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వ వరకు జరిగే ఈ ఉత్సవాలలో అమ్మవారికి ప్రతిరోజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు.

పైడిమాంబ తీర్థం

వేపాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వీలుపర్తి, వెల్దాం గ్రామాల ప్రజల ఆరాధ్యదేవత నేరెళ్ల పైడిమాంబ తీర్థ మహోత్స వాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ శానాపతి లీల, అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పూర్తి స్థాయిలో వెచ్చించాలి

విజయనగరం దాసన్నపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన కోసం జిల్లాకు కేటాయించిన రూ.331.32 కోట్ల ఉపాధి హామీ నిధులు 2025 మార్చిలోగా సరిగా వెచ్చించేలా చూడాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ.. డ్వామా పీడీ శారదాదేవిని కోరారు. గురువారం డ్వామా కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 11 జిల్లాలకు రూ.1995.78 కోట్లు మంజూరు చేసిందని... ఇప్పటి వరకూ రూ.567.14 కోట్ల ఖర్చుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. తిరుపతి, విజయనగరం, ఎన్టీఆర్ జిల్లాలకు కేటాయించిన రూ.661.47 కోట్లలో రూ.144.32 కోట్లే వెచ్చించారని తెలిపారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. పీడీని కలిసిన వారిలో రాజారావు, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలా.. అయితే రండి

రాజాం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న రాజాం సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశంలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి... పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. సమావేశానికి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ డా.బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మషిలమణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, స్వతంత్ర సభ్యులు ఎస్.మురళీకృష్ణ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో వ్యక్తి హల్‌చల్

విజయనగరం క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గురువారం ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా మాసోత్సవాల పోస్టర్ విడుదల కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఆ వ్యక్తి అలజడి సృష్టించాడు. పోర్టికో వద్ద పోస్టర్ విడుదల చేస్తున్న సమయానికి అకస్మాత్తుగా వారికి అడ్డంగా వచ్చాడు. మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు కనిపించడంతో ఆ వ్యక్తి వచ్చీరాని ఇంగ్లీషులో మాట్లాడడంతో రవాణా శాఖాధికారులు సైతం మిన్నకుండిపోయారు. వాహనాల పార్కింగ్ వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఆ వ్యక్తిని బయటకు తీసుకెళ్లడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అతడికి మతిస్థిమితం లేదని గుర్తించారు.

క్రైం న్యూస్

కొండవెలగాడలో యువకుడి ఆత్మహత్య



సూర్యనారాయణ (ఫైల్)

నెల్లిమర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొండవెలగాడ గ్రామానికి చెందిన తిరపల్లి సూర్యనారాయణ (26) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన సోదరుడు కనకరాజు నెల్లిమర్ల పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరంలోని వస్త్ర దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న సూర్యనారాయణ చేసిన అప్పులు తీర్చలేనన్న భయంతోనూ, ఇంటి సమస్యల కారణంగా మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 14న సాయంత్రం గ్రామానికి సమీపంలోని మామిడితోటకు వెళ్లి పురుగు మందు తాగాడు. వెంటనే తాము ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయిందని... బుధవారం రాత్రి మరణించాడని కనకరాజు పోలీసులకు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

భోగాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భోగాపురం జాతీయ రహదారిపై గురువారం లారీ బోల్తా పడింది. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... కర్ణాటక నుంచి ఒడిశాకు పంచదార లోడుతో లారీ వెళుతోంది. విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారిలో భోగాపురం సమీప జాతీయ రహదారిపైకి వచ్చేసరికి డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. దీంతో లారీ డివైడర్‌ను ఢీకొట్టి.. బోల్తా పడింది. లారీలో ఉన్న పంచదార బస్తాలన్నీ రహదారిపై పడిపోయాయి. దీని వల్ల కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయట పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ గోపాలరావు

సంతకవిటి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులు గురువారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. సంతకవిటి కూడలిలో ఎస్ఐ ఆర్.గోపాలరావు వివిధ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మత్తు పదార్థాలు, సారా అక్రమ రవాణాపై దృష్టి పెట్టారు. శబ్ద కాలుష్యాన్ని సృష్టించే సైలెన్సర్లను తొలగించారు. హెల్మెట్‌ను కచ్చితంగా ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

రహదారి నిబంధనలు పాటించాలి: కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను తన ఛాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లనే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. నిబంధనలు పాటించడం ద్వారా వీటిని నివారించవచ్చునని సూచించారు. వాహనం నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భద్రతా నియమాలు పాటిస్తూ వాహనం నడపాలని సూచించారు. ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకూ జరిగే మాసోత్సవాల్లో భాగంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, రహదారి భద్రతా నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మణి కుమార్ మాట్లాడుతూ రహదారి భద్రతా మాసోత్సవాలపై వాహనదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ప్రమాదాలను నియంత్రిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఓ విమల, ఎంవీఐలు దుర్గాప్రసాద్, మురళీకృష్ణ, రవి శంకర్, వెంకటరావు, ఉష, శ్రావ్య పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గోపూజ



చీపురుపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

లక్కవరపుకోట (కొత్తవలస), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నరపాం గ్రామంలో గురువారం గోపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తవలస సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోవులకు పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కొరుపోలు అప్పారావు, నారాయణశర్మ పాల్గొన్నారు.

చీపురుపల్లిలో...

చీపురుపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గామల్లేశ్వర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గోపూజ కార్యక్రమం నిర్వహించారు. కస్పా వీధిలో ట్రస్ట్ అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్లు రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు గోపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమరాం సర్పంచ్ రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా గుహలింగేశ్వర స్వామి తీర్థ మహోత్సవం



లక్కవరపుకోట: ఎడ్ల పరుగు పందేల దృశ్యం



జామి: స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

లక్కవరపుకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన గృహలింగేశ్వర స్వామి కొండ తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ తీర్థ మహోత్సవానికి విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఏటా ముక్కనుమ రోజున ఈ తీర్థ మహోత్సవం నిర్వహిస్తారు. కొండ గుహలో శివలింగం, కొండపైన కోదండరాముడు కొలువై ఉండడం ఇక్కడి ప్రత్యేకత. 18 గ్రామాల ప్రజలు ఈ తీర్థమహోత్సవాన్ని నిర్వహించి చుట్టాలు, బంధువులను ఆహ్వానిస్తారు. రేగ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు చేశారు. ఈ తీర్థ మహోత్సవం సందర్భంగా పెదిరెడ్ల పాలెంలో గురువారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం అజనగిరి బండి విజయం సాధించి... రూ.20వేల నగదు బహుమతి అందుకుంది. మొత్తం 10 బండ్లు పోటీ పడ్డాయి. లెక్కలవానిపాలెం బండి ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, వావిలపాడు బండి తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందుకున్నాయి.

భజన పోటీలు

మండలంలోని రేగ గ్రామంలో ముక్కనుమ సందర్భంగా గురువారం భజన పోటీలు నిర్వహించారు. విశ్వమంథా ట్రస్టువారి సౌజన్యంతో భజన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో వేపాడ, కొత్తవలస, ఎల్.కోట, కోటపాడు మండలాల నుంచి ఏడు బృందాలు పాల్గొన్నాయి. ఇందులో బొద్దాం భజన బృందం మొదటి స్థానం కైవసం చేసుకుంది. విజేతలకు ట్రస్టు చైర్మన్ ఎం.అమ్మాజీ రూ.20 వేల నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎం. శ్రీనివాసరావు, ఎం.సూర్యం మాస్టారు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుని తీర్థం



వేపాడ: పూజలందుకున్న జగన్నాథుడు

వేపాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముకుందపురం గ్రామంలో గురువారం సాయింత్రం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం వెంకట జగన్నాథ స్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనకరాజు, గ్రామ పెద్ద జామి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని ఉత్సవం

జామి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి తిరువీధులు



తిరువీధుల్లో పాల్గొన్న భక్తులు

రాజాం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కంచరాం గ్రామంలోని అయ్యప్ప స్వామి తిరువీధులను గురువారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త టంకాల పాపినాయుడు స్వామి వృద్ధులకు వస్త్ర దానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి కుటుంబానికి సాయం



మృతుడి కుటుంబానికి చెక్కు అందిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మలేరియాతో మృతిచెందిన రైల్వే ఉద్యోగి కుటుంబానికి సహచర ఉద్యోగులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే శృంగవరపుకోట సెక్షన్‌లోని శివలింగపురం పరిధిలో పాయింట్స్‌మెన్‌గా సత్యరంజన్ మహంతి పనిచేస్తున్నారు. ఈనెల 7న ఆయన మలేరియాతో మృతిచెందాడు. అతని కుటుంబానికి రైల్వే ఉద్యోగులు మొత్తంగా రూ.లక్ష 22వేల 900 ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో నండ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 314 మంది అర్హత

విజయనగరం క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ 11వ రోజు గురువారం సజావుగా సాగింది. దేహదారుఢ్య పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా.. 415 మంది మాత్రమే హాజరయ్యారు. వీరిలో 314 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావులు నియామక ప్రక్రియను స్వయంగా పర్యవే క్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వీరకుమార్, రాఘవులు, శ్రీనివాసరావు, థామస్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పరుగు పందేలు

జామి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విజినిగిరి గ్రామంలో పండుగ సందర్భంగా స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో పరుగు పందేలు, నడక పోటీలను నిర్వహించారు. గ్రామంలో ఉన్న నిరుపేదలకు నెలకు సరిపడా రేషన్ సరుకులను అందించారు.

ఎత్తు పెరిగింది.. నీరు రానంది!



పట్రువాడ గ్రామం వద్ద బీవీ చానల్

● ఇదీ బీవీ చానల్ పరిస్థితి ● రెండు మండలాల రైతులకు కష్టం

గజపతినగరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏటా రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీటికి వ్యయ ప్రయాసలు పడుతున్నారు. పాలకులు, అధికారులు మారుతున్నా రైతులకు అవసరమైన సాగునీటి కాలువలను మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలోని బీవీ చానల్ (బొండపల్లి-వెంకటాపురం) కాలువ కింద గజపతినగరం, బొండపల్లి మండలాల్లోని 8 గ్రామాల రైతులు సుమారు 3వేల హెక్టార్లకు పైగా పంటలు సాగు చేస్తున్నారు. ఏటా సాగునీటికి ఈ మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల పట్రువాడ గ్రామం వద్ద చంపావతి మినీ వంతెన ఏర్పాటు చేయడంతో బీవీ చానల్ ఎత్తు పెరిగింది. రానున్న ఖరీఫ్‌నకు చంపావతి నీటిని బీవీ చానల్‌కు మళ్లించడం కష్టతరమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎత్తు తగ్గితే గానీ చానల్ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. చంపావతి నదిలో బీవీ చానల్‌కు నీరు మళ్లించే విధంగా గోడ నిర్మిస్తే మేలు జరుగుతుందని అంటున్నారు. లేదంటే ఇబ్బందులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. చంపావతి నుంచి ఇసుక అక్రమంగా తరలించుకుపోవడం వల్ల బీవీ చానల్‌కు నీరు వచ్చే అవకాశాలు తగ్గుతున్నాయని... సంబంధిత అధికారులు స్పందించకపోతే రబీ పంటలకు సాగునీరు కష్టతరమేనని రైతులు అంటున్నారు. గత ఏడాది వరకు పట్రువాడ గ్రామం వద్ద చంపావతి నదిలో ఇసుక బస్తాలు వేసి నీరు పంట పొలాలకు మళ్లించేవారమని... ప్రస్తుతం మినీ వంతెన వల్ల కాలువ ఎత్తు పెరగడంతో ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... గోడ నిర్మాణం చేపట్టి కాలువకు నీరు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని రెండు మండలాలకు చెందిన వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు.



పెంటలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ వాహనం

నిర్వహణ లేక.. వినియోగానికి నోచుకోక

● ఇదీ బొబ్బిలి మండలంలోని గ్రామాల్లో చెత్త సేకరణ వాహనాల పరిస్థితి

బొబ్బిలిరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు వినియోగించే చెత్త సేకరణ వాహనాలు నిర్వహణ లేకపోవడంతో మూలకు చేరుతున్నాయి. చిన్నపాటి మరమ్మతులుచేసి వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశమున్నా అధికారులుచర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలొస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని పంచాయతీల్లో చెత్త తరలించే బ్యాటరీ వాహనాలు, మూడు చక్రాల చెత్త సైకిళ్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో చెత్త తరలించడానికి ఈ వాహనాలు పంచాయతీలకు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే ప్రభుత్వం మారడం, నిర్వహణ లేక ఈ వాహనాలు మూలకు చేరాయి. పెంట, తదితర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు వినియోగించే వాహనాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోడ్లపై నిరుపయోగంగా పడిఉన్నాయి. మరమ్మతులకోసం సచివాలయంలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేద సిబ్బంది చెబుతున్నారు. తమకు వేతనాలు కూడా చెల్లించడం లేదని వాపోతున్నారు. కాగా ఎస్సీ కార్పొరేషన్ నిధులతో అందుబాటులోకి తీసుకొచ్చిన వాహనానికి డ్రైవర్ సరిగా నిర్వహణ చేయకపోవడంతో మూలకు చేరిందని పెంట గ్రామ సచివాలయ కార్యదర్శి రవీంద్ర తెలిపారు.

వైద్యుడు లేరు.. సిబ్బంది కరువు

● గుర్ల, చీపురుపల్లి ఆస్పత్రులకు వెళ్తున్న రోగులు ● ఇదీ గరివిడి ఆయుష్ క్లినిక్ పరిస్థితి

గరివిడి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గరివిడి పీహెచ్‌సీలో గల ఆయుష్ క్లినిక్‌కు రెండేళ్లుగా వైద్యాధికారితోపాటు సిబ్బంది లేకపోవడంతో హోమియో మందులు వినియోగిస్తున్న రోగులు ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వహించి డి.వెంకటమధు రెండు సంవత్సరాల కిందట గుర్ల మండలానికి బదిలీపై వెళ్లిపోయిన విషయంవిదితమే. అప్పటినుంచి ఇంతవరకు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం ఏ ఒక్కరిని వైద్యాధికారిగా నియమించలేదు. వైద్యాధికారితోపాటు కంపౌండర్, అటెండర్ కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్లినిక్‌కు ఉండాలి. కానీ రెండేళ్లుగా ఏ ఒక్కరు కూడా ఇక్కడ లేకపోవడం గమనార్హం. వైద్యాధికారి అందుబాటులో ఉన్న సమయంలో రోజుకు సుమారు 50 మంది వరకు బీపీ, షుగర్ తదితర దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు హోమియో వైద్యం కోసం పీహెచ్‌సీకి వస్తుండేవారు. అయితే వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో హోమియో మందులు వాడే రోగులు గుర్ల, చీపురుపల్లి మండలాలకు వ్యయప్రయాశలు పడి వెళ్లాల్సివస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఓపీ ఉన్నా...

గరివిడి పీహెచ్‌సీలో గల ఆయుష్ క్లినిక్‌కు ప్రతిరోజూ 50 మంది వరకూ సేవలు పొందేందుకు వస్తుంటారు. గరివిడి మండలంలోని కోడూరు, తాటివాడ, గెడ్డవలస, కేఎల్‌పురం తదితర 30 పంచాయతీల నుంచి ఇటీవల ఆయుష్ సేవలకు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ వైద్యాధికారి, సిబ్బంది లేకపోవడంతో మూడు కిలోమీటర్లు దూరంలోని చీపురుపల్లి, ఐదు కిలోమీటర్ల దూరంలో గుర్ల ఆయుష్ సేవలకు వెళ్లాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆయుష్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వైద్యాధికారి, సిబ్బందిని తక్షణమే నియమించాలని పలువురు కోరుతున్నారు.



ఆయుష్ క్లినిక్‌లో ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

కాలువలో తుప్పలు.. అన్నదాతకు అగచాట్లు

● శివారు ఆయకట్టుకు అందని నీరు ● ఇదీ పారాది కాలువలో పరిస్థితి

బొబ్బిలి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారాది కాలువ పరిధితో తుప్పలు, డొంకలు పేరుకుపోవడంతో అన్నదాతకు అగచాట్లు తప్పడం లేదు. రబీలో వేసిన పంటలకు నీరందని పరిస్థితి నెలకొందని మెట్టవలస, పెంట, రంగరాయపురం తదితర శివారు గ్రామాల్లో ఐదువేల ఎకరాలు సాగుచేస్తున్న రైతులు వాపోతున్నారు. కాలువల్లో తప్పులు పెరిగిపోవడంతో నీరువెళ్లకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులువాపోతున్నారు. కాలువలో తూడు, గుర్రపు డెక్క, కర్రనాచు, తుప్పలు తొలగించాలని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు రైతులు చెబుతున్నారు.దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క ఏళ్ల తరబడి తొలగించని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జలవనరుల శాఖ అధికారులు స్పందించికాలువల్లో పూడిక తీసి వచ్చే రబీ సీజన్‌కు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాలువలో తుప్పలు పేరుకుపోయిన దృశ్యం

ఒక్క ఇటుక పడితే ఒట్టు

(ఐదో పేజీ తరువాయి)

అంచనా వ్యయం పెరుగుతోంది. తొలుత యూనివర్సిటీ శాశ్వత భవన నిర్మాణాలకు రూ.525.08 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు. అయితే, స్థల సేకరణ జాప్యం కారణంగా నిర్మాణ వ్యయం రూ.834 కోట్లకు పెరిగింది. తాజాగా, రూ.1000 కోట్లకు పైబడి ఖర్చువుతుందని అధికారులు అంటున్నారు. ఈ భారం కూటమి ప్రభుత్వంపై పడనుంది. అయితే, ఎలాగైనా భవన నిర్మాణాలను పూర్తి చేయాలనే పట్టుదలతోఉంది. మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలో సేకరించిన భూముల్లో భవనాలను నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యి. పనులు వేగవంతం చేయాలని నాలుగు నెలల కిందట కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించా రు. దీంతో కలెక్టర్ బీఆర్ అంబేద్కర్.. యూనివర్సిటీ అప్రోచ్ రోడ్డు కోసం 12 ఎకరాలు గుర్తించారు.ఇప్పటికే 7 ఎకరాలు అప్పగించారు. రెల్లి వద్ద సేకరించిన భూములను గ్రేహౌండ్స్ విభాగానికి అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

ఆయువు పోద్దాం

(ఐదో పేజీ తరువాయి)

చాలామంది అవయవాలు సరిగ్గా పనిచేయక సతమతమవుతుంటారు. మరి కొందరు మరణిస్తుంటారు. అటువంటి వారికి అవయవదానం పునర్జన్మనిస్తుంది.

అవయవ దాతల కొరత..

జిల్లాలో అవయవదాతల కొరత ఉంది. చాలామంది అవయవాలు సమకూరక మృత్యువాత పడుతున్నారు. 1994లో తొలిసారిగా మనదేశంలో అవయవ, కణాల మార్పిడి చట్టాన్ని తీసుకొచ్చారు. 2011లో దానికి సవరణలు చేశారు. అవయవాల సేకరణ, తరలింపు, కేటాయింపు వంటిని జాతీయస్థాయిలో జాతీయ అవయవ, కణజాల మార్పిడిసంస్థ (ఎన్‌ఓటీటీఓ) పర్యవేక్షిస్తోంది.తెలుగు రాష్ట్రాలకు సంబందించి జీవన్‌దాన్, ఇండియన్ రెడ్‌క్రాస్ వంటి సంస్థలు బాధ్యతలను చూస్తున్నాయి. అయితే జిల్లాలో అవయవదానంపై ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. మరణంతరువాత అవయవదానంచేస్తామని ప్రజాప్రతినిధులు,అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులుముందుకొస్తే ప్రజల్లో కూడా చైతన్యం పెరిగే అవకాశముంది. రెడ్ క్రాస్ సంస్థ అవయవదానంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తూ ఒప్పంద పత్రాలను సేకరించింది.

అంత్యక్రియలకు కలెక్టర్ హాజరు..

అవయవదాత అంత్యక్రియలకు కలెక్టర్ లేదా ప్రభుత్వ తరుపున ఒక ప్రతినిధి తప్పకుండా హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించింది. అంత్యక్రియలకు అయ్యే ఖర్చులకు రూ.10 వేలు అందిస్తోంది. అయితే అవయవాలు తరలింపునకు వీలుగా గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని మార్గాలను సైతం ఎంపిక చేసింది.

గొప్పదానం అది..

అవయవదానంతో పాటు నేత్రాల దానం ఎంతో గొప్పదైనది. సాధారణంగా బ్రెయిన్ డెడ్ అయిన వారి విషయంలో చాలామంది అవయవదానానికి ముందుకు రారు. అటువంటి వారి తల్లిదండ్రులు.. అవయవాలు దానం చేసి కుమారుడ్ని ఇతరుల్లో చూసుకోవాలి. అవయవదాతలు లేక చాలామంది ప్రాణాలు వదులుతున్నారు. అందుకే అవయవదానానికి ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

-పిజగన్మోహన్‌రావు, రెడ్‌క్రాస్ చైర్మన్

పన్ను వసూళ్ల లక్ష్యాలు అధిగమించాలి

బొబ్బిలి,జనవరి 16 (ఆంధ్రజ్యోతి):పన్నుల వసూళ్ల లక్ష్యాలను అధిగమిం చేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ వి.రవీంద్ర ఆదేశించారు. గురువారం బొబ్బిలి మునిసిపల్ కార్యాల యంలో పలు అంశాలపై సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణపై చర్చించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను రవీంద్ర గురువారం రాత్రి పరిశీలించారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి, మేనేజరు దీక్షితులు, డీఈ కిరణ్ కుమార్, ఆర్వో నాగరాజు, ఏఈలు, ఎస్ఐ మురళి ఉన్నారు.



అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న రవీంద్ర

కారు ఢీకొని ఒకరికి గాయాలు

రామభద్రపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి):బూసాయవలస వద్ద గురువారం కారు ఢీకొనడంతో రామభ్రపురం గ్రామానికి చెందిన ఇప్పల వలస వెంకటరమణకు గాయాలయ్యాయి. కర్రలవ్యాపారం చేస్తున్న ఆయన బూసాయ వలస కర్రల మిషన్ నుంచి వస్తున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో గాయపడ్డాడు.దీంతో 108లో ఆసుపత్రికి తరలించారు.

విజేతలకు బహుమతి ప్రదానం

జామి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భీమసింగిలో హనుమాన్ సేవాదళ్ యూత్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం నిర్వహించారు. విజేతలకు టీడీపీ మండలాధ్యక్షుడు స్వామినాయుడుఆధ్వర్యంలో బహుతులు అందించారు.

క్రికెట్ విజేత కల్లేపల్లి

లక్కవరపుకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రేగ గ్రామంలో మరిడిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా క్రికెట్ పోటీల్లో కల్లేపల్లి జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 40 టీములు పాల్గొన్నాయి. ద్వితీయ స్థానం రేగ, తృతీయ స్థానం కేవీ రేగ జెడ్పీ హైస్కూల్ సాధించాయి. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు, 3వ బహుమతిగా రూ.3 వేల నగదు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అవగాహనతోనే క్షయ నివారణ

సంతకవిటి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై ప్రజలు జాగ్రత్తలు వహిస్తే పూర్తిగా నయమవుతుందని టీబీ సూపర్‌వైజర్ పి.వేణుగోపాల్ తెలిపారు. గురువారం మిర్తివలస గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నవాడు, హెచ్‌వి. కె.నిర్మల, హెచ్.ఎ. బి.శంకరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



భామిని: కార్యకర్తలతో మాట్లాడుతున్న జయకృష్ణ

భామిని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. గురువారం భామిని మండలంలోని నేరడిలో టీడీపీ, కూటమి పార్టీల కార్యకర్తలతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోరాష్ట్రం అప్పులఊబిలోకి వెళ్లిపోయిందని విమర్శించారు.అనంతరం బాలేరు, నేరడి ఇటీవల మృతి చెందినజి.రాజులు, బి.శిమ్మయ్య, ఎస్.తవిటమ్మ, బి.రామారావు కుటుంబ సభ్యులు పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదీష్, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

● వీరఘట్టం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి సంబంధించి వివిధ పరికరాలు సబ్సిడీపై రైతులకు అందిస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని ఎం.రాజపురంలో రైతులకు నూర్పుయంత్రాలను వీరఘట్టం, పాలకొండమండలాల్లోని రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పాలకొండ మండల పరిషత్ అధ్యక్షులు బొమ్మాళి భాను, కూటమినాయకులు కర్నేన అప్పలనాయుడు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయానఉదయ్‌భాస్కర్, సుధాకర్, పొగిరి శివన్నారాయణ, బొమ్మాళి సురేష్ పాల్గొన్నారు.

రైతులకు బకాయిలను చెల్లించాలి

● జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాలం

బొబ్బిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2021-22 సంవత్సరంలో ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించిన రైతులకు రావల్సిన రవాణా చార్జీల బకాయిలను వెంటనే చెల్లించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాలం డిమాండ్ చేశారు. గురువారం బొబ్బిలి పీఏ సీఎస్అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి వైసీపీ ప్రభుత్వం రైతులకు లోడింగ్, అన్‌లోడింగ్, రవాణాచార్జీలు ఇస్తామని ప్రకటించడంతో రైతులు తమ సొంత సొమ్ము ఖర్చు పెట్టి రవాణా చేశారని తెలిపారు. ఈ విషయంపై రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపడితే ఆ నిధులను సొసైటీలకు ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. సొసైటీ నుంచి రైతులకు చెల్లింపులు జరగలేదని తెలిపారు. సొసైటీ అధికారులు తక్షణమే స్పందించి రైతులకు రావాల్సిన లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా చార్జీలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని గోపాలం తెలిపారు.



పీఏసీఎస్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గోపాలం

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

రామభద్రపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టక్కిలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. కొట్టక్కి రామమందిరం వద్ద దండు సింహాచలం(55)ఒంటరిగా నివాసముంటోంది.ఆమె భర్త త్రినాథ తొమ్మిదేళ్ల కిందట మృతిచెందాడు. పిల్లలు కూడా లేరు. పింఛన్ డబ్బులతోనే జీవనం సాగిస్తోంది.బుధవారం నుంచి ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. దీంతో బంధువులు సింహాచలం ఇంటికివెళ్లి తలుపులు తీసి పరిశీలించారు. ఫ్యాన్ కొక్కెంకు ఉరివేసుకొని విగతజీవిగా పడి ఉంది. ఆమె మేనల్లుడు మాధవరావు పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఆమెను ఎవరో హత్యచేసి చీరతో ఉరివేసినట్టుగా చిత్రీకరించారని బంధువులు రోదిస్తున్నారు. బంగారు ఆభరణాల కోసమే హత్యచేసి ఉంటారని అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని బొబ్బిలి డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నారాయణరావులు పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు, ఆధారాలను సేకరించింది. ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బృందం పరిశీలించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.



సింహాచలం (ఫైల్)



ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ

వినియోగంలో లేక.. శిథిలావస్థకు చేరి

● అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం

● ఇదీ బొబ్బిలిలోని ఎస్సీ బాలికల వసతి గృహం పరిస్థితి

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలోని ఎస్సీ బాలికల వసతి గృహం భవనం వినియోగంలో లేకపోవడంతో నిరుపయోగంగా ఉండడం వల్ల శిథిలావస్థకు చేరింది. కొద్దేళ్ల కిందట వసతిగృహం మూసివేశారు. నిత్యం రద్దీగా ఉండే పురపాలక సంఘం కార్యాలయం రోడ్డు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, పోలీస్ ఠాణా మధ్యలో ఈపురాతన భవనముంది. నిరుపయోగంగా ఉండడంతో ఈ భవనాన్ని కొందరు మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి భవనాన్ని పూర్తిగా కూల్చివేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న బాలికల వసతి గృహం

మద్యం తాగేశారు.. సీసాలు వదిలేశారు

● కిటకిటలాడిన దుకాణాలు ● కుప్పలుగా పేరుకుపోయిన వైనం

గరుగుబిల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో మద్యం సీసాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. కనుమతోపాటు ముక్కనుమ నేపథ్యంలో మండలంలోని మూడు దుకాణాల వద్ద మద్యం కోసం బారులుతీరారు.కొందరు అక్కడే మద్యం తాగి దుకాణాలకు ఆనుకుని ఖాళీ సీసాలు వదిలేశారు. సంక్రాంతికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో స్వగ్రామాలకు తరలివచ్చారు. వీరంతా నాలుగు రోజుల పాటు ఏకధాటిగా అధికంగా మద్యంపైనే దృష్టి సారించారు. దీంతో తెల్లవారి పదిగంటల నుంచే మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. దుకాణాల పరిసరాల్లో కుప్పలుగా ఉన్న ఖాళీ మద్యం సీసాలను చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ఉల్లిభద్ర ఎర్రన్నగుడి సముదాయంలో ఓ మద్యం దుకాణం పరిసరాల్లో కుప్పగా ఉన్న ఖాళీ మద్యం సీసాలు

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

రామభద్రపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరుకు అర్హులైనవారు ఏపీవో బీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రత్నం కోరారు. బీసీ, ఈబీసీ, బ్రాహ్మణ, వైశ్య తదితర కులాలకు చెందినవారు ఈ రుణాలకు అర్హులని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



బొబ్బిలి రూరల్: పిరిడి పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బొబ్బిలి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండంలోని పిరిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయ కలయిక కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పూర్వవిద్యార్థులు బలిజిరెడ్డి విజయకుమార్, కొట్నాన చలపతి, మువ్వల రామకృష్ణ, కొల్లి రామినాయుడు, మువ్వల చిన్నంనాయుడు, పోల వెంకటరమణ, దాసరి సత్యనారాయణ, కోరాడ వెంకటరమణ, చింతాడ పైడితల్లి, బలగ శారద, కె.అన్నపూర్ణ పాల్గొన్నారు.

●రామభద్రపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరికతోట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల గురువారం హెచ్ఎం శర్మ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అప్పట్లో బోధించిన గురువులు అడపా అప్పలకొండ, సాసుబిల్లి శ్రీరామ్మూర్తి, రాజేశ్వరమ్మ, సూర్యనారాయణ, బుచ్చినాయుడు, అప్పారావు, రామకృష్ణ గున్నేశ్వరరావు, అల్లు సత్యంనాయుడును సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకున్నారు. అలాగే 2002-03 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కూడా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఏకాగ్రతతో బస్సు నడపాలి: డీఎం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పాలకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు కోరారు. పాలకొండ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకుని గురువారం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమన్నారు. బస్సుఏకాగ్రతతో నడిపి ప్రయాణికులను సురక్షితంగా దింపాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ జగ న్నాథం, ఏడీసీలు భానూరు కృష్ణమూర్తి, జగన్నాథం, డీఎస్‌వీ రాజు, ఎస్‌డీఐ ఎస్ఎన్.రాజు,సెక్యూరిటీగార్డుహెడ్ రాముబాబు,యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బొబ్బిలి, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి కోటి చెరువు నుంచి పట్టణానికి వచ్చే 11 కేవీ మహారాణిపేట ఫీడరు లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బొబ్బిలి ఈఈ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించడం, లైన్ల నిర్వహణా పనుల వల్లగొల్లవీధి, సింగారపు వీధి, పూల్‌బాగ్‌ల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. కలువరాయి సబ్ స్టేషన్ పరిధిలో కూడా పనులు చేపట్టనుండడంతో అక్కడ కూడా విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

5 నుంచి విగ్రహాల ప్రతిష్ఠ

గరుగుబిల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తోటపల్లివేంకటేశ్వర, శ్రీకోదండరామ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు పలువిగ్రహాల ప్రతిష్ఠకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి హైదరాబాద్‌లోని పుష్పగిరి పీఠాధిపతి హాజరుకానున్నారని అభివృద్ధి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు తెలిపారు.